# అలవాటు దోషం



ప్రసాద్ ఆర్టీసీలో డ్రైవర్.

బస్ డ్రైవింగ్‌లో అతనికి మంచి నైపుణ్యం ఉంది. ఆ విషయమై అతనికి గర్వం కూడా వుండేది. బస్సుని సమయానికి ప్రతి స్టేజికి తీసుకువచ్చి, ఎప్పుడూ ఆలస్యం లేకుండా రికార్డ్ సృష్టించాడు. దానికితోడు- ముప్పయి ఐదు సంవత్సరాలు పైబడి బస్సులు నడిపినా- ఎప్పుడూ ఏ యాక్సిడెంట్ చేయలేదు. అందువల్ల అతనంటే తోటి ఉద్యోగులకీ, అధికారులకి కూడా గౌరవం ఉండేది.

అయితే... అతనితో ఒకటే చిక్కు- ఎప్పుడూ తన మాటే నెగ్గాలనే తత్త్వం అతనిది.

ఆరోజు బస్సు డిపోకి తిరిగి వచ్చింది.

మళ్లీ బయలుదేరడానికి ఇంకా నలభై నిమిషాల టైం ఉంది. కొత్త కండక్టర్ విజయ్, ప్రసాద్ కలిసి పక్కనే ఉన్న క్యాంటీనుకి వెళ్లారు.

"అరెభాయి... ఇంజన్ ఆపకుండా వచ్చేశావు. అనవసరంగా డీజిల్ కాలుతోంది. ఆపేసి రా!" అన్నాడు విజయ్.

"ఆ... ఇది మామూలేగా! ఎప్పుడూ అలాగే వదిలేస్తాను... ఏమవుతుందని?!" అన్నాడు ప్రసాద్ తేలిగ్గా.

"అరె... ఇంకా నలభై నిముషాల టైం వుంది. డీజిల్ వేస్ట్ కాదూ?!" అన్నాడు విజయ్.

"ఎవరికి... మనకా? గవర్నమెంట్‌దే పోతుంది. మనకేం?" అన్నాడు ప్రసాద్.

అతని మాటల్లో ప్రభుత్వం అంటే ఏహ్యాభావం కనిపిస్తోంది. విజయ్ ఇంకేమీ అనలేదు.

మరికొద్ది నెలల్లో ప్రసాద్ రిటైర్ అయ్యాడు.

ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ మొదలైనవాటితోనూ, వారసత్వపు ఆస్తి కొంత అమ్మి వాయిదాల పద్ధతి మీద ఒక లారీ కొన్నాడు. దానిని తానే స్వయంగా డ్రైవ్ చేయసాగాడు.

లారీ అయితే కొన్నాడు. బాగానే ఉంది- కాని, అతని అలవాటు దోషం ప్రసాద్‌ని వెంటాడసాగింది. కాఫీకి వెళ్లినా, భోజనానికి వెళ్లినా, సరుకులు ఎక్కించుకునేటప్పుడూ, దింపేటప్పుడూ ఇంజన్‌ని అలాగే వదిలి వేసేవాడు.

దానితో డీజిల్ ఖర్చు విపరీతంగా అయ్యేది. డీజిల్ పోయించుకునేటప్పుడు మాత్రం- 'అరే... గవర్నమెంటుది కదా- అని డీజిల్ వృధా చేసేవాడిని. ఆ అలవాటే ఇప్పుడు నాకూ దెబ్బ కొట్టోంది. ఈ అలవాటు మానుకోవాలి' అనుకునేవాడు. కాని, బయటకి వచ్చాక మళ్లీ యథాప్రకారమే.

'అలవాటు దోషం' అంత త్వరగా పోతుందా..?!

*- జాగృతి వార పత్రిక... 26 నవంబర్-4 డిసెంబర్ ' 88*